అప్రతిభుడై చూస్తూ ఉండిపోయాడు ఉపాధ్యాయ.

పసిపిల్లల్ని తక్కువగా అంచనా వేయడం ఎంత పొరపాటో పెద్ద వాళ్ళని ఎక్కువగా అంచనా వేయడం అంతే పొరపాటుగా అర్థమైందో లేక ఎక్కడో స్టేట్స్‌లో పెరిగిన తన మనవరాలిలో తన వూహకందని మేధావే కనిపించిందో కోర్టులో నడుస్తున్న కేసుని ఇలా ముగించి చౌదరిపై విజయాన్ని సాధించే కృషిని అభినందించకుండా వుండలేకపోయాడు-

కృషి ఊహ తప్పుకాలేదు.

మరుసటి రోజు మధ్యాహ్నానికే గుడిసెలకి పట్టా పంపిణీ ఏర్పాటు చేసిన కృషి అప్పటికే కార్మికుల్లో చిన్న కదలికకి కారణమైన సుధీర్‌కుమార్ ప్రయత్నానికి చాలా బలాన్ని అందించింది.

0 0 0 0

"డేమిట్"

ఇంచుమించు గుండెలు బాదుకున్నట్టుగా కలవరపడిపోయాడు రమానాథచౌదరి...

కొన్ని రోజులపాటు తన గెలుపుని ఎంజాయ్ చేయాలనుకున్న చౌదరి ఇప్పుడు కార్మికుల్లో వచ్చిన మార్పుని తట్టుకోలేకపోయాడు కేవలం గంటల వ్యవధిలో కార్మికుల్ని విభజించడమే గాక జరిగిన పొరపాటుకి అంతా పశ్చాత్తాప పడి ఇక ముందు తొందరపడమని 'అండర్ టేకింగ్స్' రాయించుకుని మరీ ఫ్యాక్టరీలో అడుగుపెట్టేట్టు చేసింది.

ఎదురుగా దేభ్యం మొహాలు వేసుకుని నిలబడ్డ రాజారావుని లాయరు రంగధాంల్ని చూస్తూ అరిచాడు ఆవేశంగా "వెళ్ళండి - ఓ ఆడపిల్ల తెలివిముందు చవటల్లా నిలబడాల్సి వచ్చినందుకు వెళ్ళి హుస్సేన్‌సాగర్‌లో దూకి చావండి. అసలు నీకైనా సిగ్గు లేదటయ్యా" రాజారావుతో అన్నాడు "పెద్ద మొనగాడ్ని మగాడ్ని అంటావే, ఫ్యాక్టరీలో అడుగుపెట్టే లేబర్‌ని గూండాలతో తరిమేయక ఏం చేసినట్టు."

"పోలీసు బలగాన్ని దింపిందండీ - వాళ్ళ రక్షణతోనే యిన్ని ఏర్పాట్లు చేసేసింది."

"ఏం - మనం పోలీసుల్ని అదుపు చేయలేమా"

"అసలు కార్మికుల్లో ఏ వర్గమైనా మన పక్క నిలబడి వుంటే పోలీసులు, గూండాలు ఎందుకండీ వాళ్ళలో వాళ్ళే తలలు బద్దలు కొట్టుకునేట్టు ప్లాన్ చేసేవాడ్ని" ఉద్వేగంగా అన్నాడు రాజారావు. "కాని నిన్న గాక మొన్నటి దాకా మీరిచ్చిన గుడిసెల్లో వుండి మీకు జిందాబాద్ అనే మన గ్రూపు కార్మికులు కూడా పట్టాలు దొరికేసరికి చెట్టాపట్టాలేసుకుని చక్కా ఫ్యాక్టరీలో అడుగుపెట్టారు. పైగా కృషీ జిందాబాద్ అంటూ.."

"స్టాపిట్" ఇక నిభాయించుకోలేకపోయాడు చౌదరి.

ఏదో చేయాలి. కాని ఏం చేయాలో వెంటనే తోచలేదు.

సరిగ్గా ఆ సమయంలో ఫోన్ రింగయింది.

చాలా వేగంగా.

"బాగున్నారా చౌదరీ సాబ్. . ." కృషి మాట్లాడుతోంది "ఇక ఆ లేండ్ గురించి కోర్టులో గొడవలూ శతృత్వాలూ లేకుండా సెటిల్ చేసేశానుగా."

"నా కెందుకు ఫోన్ చేశావ్"

"ఇది నా నుంచి నీకు మూడో ఓటమి అని గుర్తుచేయటానికి"

". . . . . . ."

"ఏం నిశ్శబ్దంగా వుండిపోయారు. మూడోది ఎలా అవుతుందని ఆలోచిస్తున్నారా - మొదటిది మీ క్విజ్ కిడ్‌ని గెలిపించాలని మీరు చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టి విశ్వని గెలిచినట్టుగా నేను స్టేట్‌మెంటివ్వడం. రెండోది మీదీ అనుకున్న లేండ్ మీది కాకుండ చేయడం. . . మూడోది మీరు రగిల్చిన సమ్మెని చల్లబర్చి కార్మికులు సమ్మె ఉపసంహరించుకునేట్టు చేయడం - లెక్కసరిపోయిందా."

"ఇంతటితో ఇది గెలుపుగా సంబరపడకు కృషీ. . ."

"అలా నేను పొరపాటు పడడం లేదు చౌదరీ. . . నాకు తెలుసు మీరు వూరుకోరని. ఇప్పుడు నేను మీకు స్పష్టం చేయాలనుకున్నదేమిటంటే నేనూ అంతే మొండిఘట్టాన్నని నేనీ దేశంలో వున్నంత కాలం మీ ఆటలు సాగనివ్వనని. . . ఓ.కే."

ఫోన్ క్రెడిల్ చేసింది.

నిశ్శబ్దంగా సోఫాలో కూర్చుండిపోయాడు చౌదరి.

తను ఎదగడం ప్రారంభించి ఎంతకాలమైనా కాని ఇంతకాలానికి తనకో అసలు సిసలైన ప్రత్యర్థి ఎదురైంది.

పైగా తను ఈ దేశంలో ఉన్నంతకాలం తనను ఓడించటమే ధ్యేయమంటూ సవాల్ విసురుతూంది.

నవ్వేశాడు చౌదరి.

అలాంటి మూడ్‌లో నవ్వడం చౌదరికి అలవాటు లేదు. సామాన్యంగా అతడు నవ్వేది గెలుపులోనే తప్ప ఓటమి తర్వాత కాదు. ఆ విషయం అతడి ముందు నిలబడ్డ రంగధాం రాజరావులకిద్దరికీ తెలుసు. అయినా ఎందుకు నవ్వాడో కారణం అడగలేకపోయారు.

"మొత్తానికి కృషి చాలా గట్టిపిండమయ్యా రంగధాం"

మరింత ముచ్చటగా అన్నాడు "ఎక్కడో చదువుకొని వచ్చిన ఆడపిల్ల నా అంతవాడ్ని అల్లరిపెట్టడమే గాక నా పరంగా ప్రమాదాన్ని వూహించి ముందే పోలీసులకి, హోం సెక్రెటరీకి తెలియపరచి అన్ని మార్గాల్ని మూసేసింది. ఇంకా నవరంధ్రాల్ని మూసేస్తానంటూంది - శభాష్."

అది ఓటమిని జీర్ణించుకోలేని ఉన్మాదంతో పేషెంటు డేలీరియం స్టేజ్‌లోని మాటల్లా అనిపిస్తున్నాయి.

అవకాశం వున్నప్పుడు రాజమార్గాల్లోనూ సాధ్యం కాకపోతే దొడ్డితోవల్లోనూ ప్రయాణం చేస్తూ ఆ స్థాయికి ఎదిగిన చౌదరికి మనస్తత్వ శాస్త్రం గురించి తెలీదు గాని సంఘాన్ని క్షుణ్ణంగా చదివేసాడు. . . అలా పెంచుకున్న సామ్రాజ్యంలో ఇంతకాలం సజావుగా సుఖంగా బ్రతుకుతున్న ఆయనకి చాలా రోజుల్నుంచి ఓ విషయం అర్థం కావడం లేదు.

అసలు కృషి లాంటి ఆడపిల్లకి మామూలు స్థితిలో బ్రతికే విశ్వకి పరిచయం ఏమిటి - అది విశ్వ కోసం రెండు లక్షలు ఖర్చుచేసేదాకా ఎలా పెరిగింది - ఒక మామూలు మనిషికి భిన్నంగా ఆలోచించగల చౌదరికి ఆ క్షణంలో యిదే విషయం మనసులో మెదలడం యాదృచ్ఛికం కాదు. ఓ చిన్న అవకాశం తీసుకుంటేనేం అనుకుంటూనే రంగధాం చూశాడు.

"హాస్పటల్లో వున్న విశ్వ పరిస్థితేమిటి"

ఓ రహస్యంలా అన్నాడు రంగధాం "ఈ రోజు ఉదయం స్పృహలోకి వచ్చాడు"

"తనపై అటాక్ చేసిందెవరో చెప్పగలుగుతున్నాడా."

"ఉదయం యస్సై ఇన్వెస్టిగేషన్‌కి వెళ్ళి అడిగితే ఖచ్చితంగా చెప్పలేకపోయాడట."

మృదువుగా నవ్వాడు చౌదరి.

అలా నవ్వేది నవ్వగలిగేది తిరుగులేని ఓ పథకం స్ఫురించినప్పుడే అని తెలిసిన రంగధాం ఉత్సుకతగా అడిగాడు "తమరో ప్రణాళికను సిద్ధం చేసినట్టున్నారు".

"ఉపాధ్యాయకి మామూలు స్థాయి మనుషులంటే చాలా అసహ్యం అని తెలిసిన రంగధాం - కాబట్టి ఒకనాడు పేద కుటుంబానికి చెందిన అబ్బాయిని ప్రేమించిన చెల్లిని యింటినుంచి గెంటేశాడు. ఆమె చివరి దశలో కేన్సర్‌తో చనిపోతున్నా పట్టించుకోకుండా దిక్కుమాలిన చావుకి కారణమయ్యాడు. కారణం ఓ అలగా మనిషికి భార్య అయ్యిందన్న కోపం."

ఉన్నట్టుండీ యిదంతా చౌదరి ఎందుకు చెబుతున్నదీ అర్థంగాని రంగధాం నిశ్చేష్టుడై చూస్తుండగానే "కాబట్టి ఈ రోజు కృషి ఓ సామాన్య కుటుంబానికి చెందిన విశ్వ వెంట పడుతుంటే తట్టుకోలేక అలా గూండాల్ని ప్రయోగించాడు. విశ్వపై హత్యాప్రయత్నం చేశాడు" కంక్లూడ్ చేశాడు చౌదరి.

రంగధాంకి మతి పోయింది.

సముద్రంలో ఉప్పుకి చెట్టుమీద కాయకి లింకుపెట్టి అద్భుతమైన కథనల్లి ఆలోచిస్తున్నాడు. దటీజ్ చౌదరి.

అదేరోజు రాత్రి విశ్వ వున్న హాస్పిటల్‌కి వెళ్లాడు. చౌదరికి చాలా చాలా ఆత్మీయుడయిన ఓ పోలీసాఫీసరు. వెళుతూ ఆ రోజు విశ్వపై అటాక్ చేసిన ఓ గూండా ఫోటో పట్టుకు వెళ్ళాడు. అది పోలీసాఫీసరుకి ఇచ్చింది చౌదరీయే.

"ఆ రోజు మీ మీద అటాక్ చేసిన వ్యక్తుల్లో ఇతడున్నాడా" ఫోటో చూపిస్తూ అడిగిన పోలీసాఫీసరుకి [illegible]

“రెండు రోజులుగా తోమి వదిలిపెడితే చెప్పాడు. అతనిని మీ మీద ప్రయోగించిందెవరో - అసలు ఉపాధ్యాయ స్థాయి మనిషి ఇలా దిగజారడం నా వూహాకందనిది. మీకూ ఆయనకీ మధ్య గొడవలేమన్నా వున్నాయా?”

విశ్వ అప్రతిభుడయ్యాడు.

అలాంటి అవసరం ఉపాధ్యాయకన్నా కృషికే ఎక్కువగా వుందని చెప్పలేదు విశ్వ. తొందరపడి తన శీలాన్ని కోల్పోయే పరిస్థితి తెచ్చుకున్న కృషీ ఇలాంటి సాహసానికి పూనికొని వుంటుందన్న ఏ ఆలోచనో విశ్వ అలాంటి నిర్ణయానికి వచ్చేటట్టు చేస్తే అలా ఆలోచించడం తప్పు కాదు - చౌదరి ప్రదర్శించిన అమోఘమైన తెలివి అది.

సగం గెలిచాడు చౌదరి.

“క్రిమినల్ ప్రస్తుతం కస్టడీలోనే వున్నాడు కాబట్టి మీరు వీడ్ని గుర్తించినట్టు స్టేట్‌మెంటిస్తే మొత్తం డొంక కదిలిస్తాను . . . ఉపాధ్యాయ గారిపై లీగల్‌గా. . .”

పోలీసాఫీసరు వాక్యాల్ని అర్ధోక్తిగా ఖండించాడు విశ్వ. “అవసరం లేదు ఇన్‌స్పెక్టర్ - ఇది నాకు నేనుగా తేల్చుకోవాల్సిన సమస్య.”

చౌదరి విశ్వాసపాత్రుడయిన ఆ పోలీసాఫీసరు విశ్వని ఒప్పించాలని సిన్సియర్‌గా ప్రయత్నించాడు. “ఉపాధ్యాయగారిస్థాయి మీకు తెలుసు - మీ అంత మీరుగా ఆయనతో పోరాడలేరు.”

“ప్లీజ్ ఇన్‌స్పెక్టర్” విశ్వ కళ్ళలో ఎర్ర జీరలు చోటు చేసుకున్నాయి. “దయుంచి నన్ను వదిలిపెట్టండి - ఈ విషయాన్ని ఇంకా ప్రొలాంగ్ చేయడానికి ప్రయత్నించకండి. మీరు తప్పదని అంటే అసలు ఈ ఫోటోలో వున్న వ్య క్తి ఎవరో నాకు తెలీదంటాను.”

ఇన్‌స్పెక్టర్ షాక్ తిన్నట్టుగా చూసాడు.

ఓ చిన్న ప్రయత్నంలో అవసరమైతే తన మనిషిని జైలుకి పంపి అయినా ఉపాధ్యాయని అన్‌పాప్యులర్ చేద్దామనుకున్న చౌదరి ప్రయత్నానికి విశ్వ సహకరించలేదు.

జరిగిందంతా పోలీసాఫీసరు ద్వారా తెలుసుకున్న ఆయన అలాగా అని సరిపెట్టుకోలేదు. . . సరిపెట్టుకుంటే అతడు చౌదరి కాడు.

మరి కాస్త లోతుగా విషయాన్ని శోధించాలనుకున్నాడు.

కృషికీ, అతడికీ వున్న పరిచయం ఏమిటో వివరంగా తెలుసుకోవాలనుకుంటూ ఓ పావుని చేజిక్కించుకున్నాడు రాజేషు ద్వారా.

ఆ పావు విశ్వ స్నేహితుడు సూరి.

మామూలుగా అయితే బయటికి కక్కేవాడు కాదేమో కాని ఖరీదయిన మందు తాగాక మొత్తం కక్కేసాడు సూరి.

అంతే - చౌదరిలాంటి వాడు సైతం అప్రతిభుడైపోయాడు.

శరీరాన్ని పెట్టుబడిగా పెడతాననడం అతడి వ్యూహకందనిది.

0 0 0 0

అసురసంధ్యవేళ. . . .

ఫ్రెడరిక్ ఫోర్ సేత్ 'ది నెగోషియేటర్' చదువుతున్న కృషి ఫోను రింగవుతుంటే యధాలాపంగా రిసీవర్ అందుకుంది " కృషి హియర్"

"నేనే" విశ్వ కంఠం వినిపించింది.

మనసున గుచ్చుకున్న తలపుల మొగలి పువ్వులా కదిలిందామె. హాస్పిటల్లో వున్న విశ్వ గురించి ఏ రోజు కారోజు తెలుసుకుంటూనే వుంది. ఈ రోజు ఉదయమే డిశ్చార్జి అయిన విశ్వ తప్పకుండ ఫోను చేస్తాడనీ అనుకుంది.

"గుర్తుపట్టేరనుకుంటాను" అడిగాడు విశ్వ మళ్ళీ.

ఎన్ని కోట్ల లిప్తల దూరమో పగిలి శరత్పూర్ణిమల చల్లదనాన్ని మనసు లోయల్లో దోసిళ్ళతో పోసినంత వివశత్వంతో పలకరించాలనుకుంటూనే మూగపోయింది."

"ఆశ్చర్యపోతున్నారా కృషీ"

"దేనికి"

"నేను బ్రతికే వున్నందుకు"

మనస్సు చివుక్కుమంది. ఇంకా అదే ఆకతాయితనాన్ని ప్రదర్శిస్తాడేం.

"నేను క్విజ్ కాంపిటీషన్లో గెలిచాను కదూ"

"తెలుసు"

"మీకు తెలియాల్సింది మరొకటుంది కృషీ."

"ఏమిటి"

"మన ఒప్పందం ప్రకారం మీరు నాతో ఓ రాత్రి గడపాలి"

పేర్చుకుంటున్న కలల పుప్పొడిరాలినట్టు ఆమె ఫాలభాగాన్ని ఆక్రమించిన స్వేద బిందువులు చెంపలపైకి జారేయి. తను మరిచిపోయింది వున్నట్టుండి గుర్తు చేస్తున్నాడు.

"మీరు జవాబు చెప్పడం లేదు"

"గుర్తుంది" గొణుగుతున్నట్టుగా అంది "కాని. . ."

"అదంత ముఖ్యమా అన్నది మీ ప్రశ్ననుకుంటాను కృషీ. చాలా అవసరం అన్నది నా జవాబు"

కృషి మొహంలో రంగులు మారాయి "నేను కాదంటే. . ."

"మన ఒప్పందం పత్రికలదాకా వెళుతుంది. ఎలా అని అనకండి. డబ్బున్న వాళ్ళ అభిజాత్యాల గురించి తెలిసినవాడిగా మన చర్చ చిన్న పాకెట్ రికార్డర్లో టేప్ చేశాను."

ఇంత జుగుప్సగా మాట్లాడుతున్నాడేం.

. . వాయిస్ అనలిస్ట్‌లకి అది మీ గొంతో కాదో తెలుసుకోవడం కష్టం కాదు. . . అది మీ గొంతు కాదని నిరూపించుకునే పిచ్చి ప్రయత్నం మీరు చేసినా అప్పటికే మీరు పదిమంది ముందూ అల్లరైపోతారు.. . ఎంతైనా రాయల్ ఫేమిలీ అమ్మాయిగా మీకు అది అప్రతిష్టేగా . . . సో . . . రమ్మంటారా"

ఆమె జవాబు చెప్పలేకపోతూంది.

"మీ అనుమతి నాకు అవసరం లేదు కృషీ. . . దేనికైనా సిద్ధపడే మనస్తత్వం నాది. కాబట్టే మీ మీద గెలుపు కోసం ప్రాణాలకే తెగించాను. . ."